క్లుప్తంగా

టౌన్ బ్యాంకు ఇన్‌చార్జ్ అధ్యక్షుడి నియామకం


చెంగల మహేష్

ఉరవకొండ: ఉరవకొండ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా చెంగల మహేష్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కోఆపరేటివ్ అధికారి శనివారం ఉత్తర్వులు వెలువరించారు. బ్యాంకు అధ్యక్షుడిగా కొనసాగుతున్న సాధు కుళ్లాయి స్వామి గత నెల 7న వ్యక్తిగత కారణాలతో రాజీనామా సమర్పించారు. ఈ క్రమంలో బ్యాంకు బ్యాంకు ఉపాధ్యక్షుడిగా ఉన్న చెంగల మహేష్‌కు ఇన్‌చార్జ్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తానన్నారు.

కసాపురానికి మాలధారుల పాదయాత్ర


కసాపురానికి పాదయాత్రగా వెళ్తున్న ఆంజనేయస్వామి మాలధారులు

ఉరవకొండ: మండలంలోని చిన్నముస్టూరు, ఉరవకొండ తదితర ప్రాంతాలకు చెందిన ఆంజనేయస్వామి మాలధారులు పాదయాత్రగా శనివారం కసాపురానికి బయలుదేరారు. ఉరవకొండలోని పార్కు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించిన అనంతరం మాలధారులు ఇరుముడితో పాదయాత్ర ప్రారంభించారు. మాలధారులకు వివిధ గ్రామాల్లో స్వాగతం పలికారు.

ఘనంగా రైతు దినోత్సవం


ఆదర్శ రైతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. రైతు దినోత్సవ సభకు రాష్ట్రానికి చెందిన ప్రముఖ వేరుశెనగ శాస్త్రవేత్త డాక్టర్‌కేఎస్ఎస్ నాయక్, ఈశ్వరీ బ్రహ్మకుమారి నిర్వాహకురాలు హేమలత, రైతు సంఘం నాయకులు చంద్రాయుడు, రాజేష్ తదితరులు హాజరయ్యారు. అనంతరం వీరశైవ కల్యాణ మండపంలో రైతులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్, అనంతపురానికి చెందిన కిమ్స్ సవేరా ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో గుండె పరీక్షలు, కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఆదర్శ రైతులకు ఘన సన్మానం, వస్త్రధారణ, సేంద్రియ, పకృతి, రసాయన సేద్యం చేసిన రైతులకు అవార్డులు అందించి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం అయప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మాలధారులు అయప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి వారికి ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా ఆయప్పస్వామి నామస్మరణ మార్మోగింది. అనంతరం మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు.

భక్తిశ్రద్ధలతో దర్గాహొన్నూరు స్వామి ఉరుసు


అలంకరణలో దర్గాహొన్నూరుస్వామి

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలో దర్గాహొన్నూరు స్వామి ఉరుసు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి గ్రామానికి చెందిన కొమ్మే పెద్ద కుళ్లాయప్ప ఇంటి నుంచి షంషేర్ దర్గా చేర్చే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం షంషేర్‌ను ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేడుకలకు స్థానికులతోపాటు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. అలాగే రాత్రి ఏర్పాటు చేసిన పంచరత్నాల నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా జలధి ఉత్సవం

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యంలో శ్రీమచ్చంద్రమయ్య స్వామి జలధి ఉత్సవం శనివారం నేత్ర పర్వంగా సాగింది. స్వామిని అలంకరించి వెండి పల్లకిలో కర్ణాటక సరిహద్దున జోడుకాలువల వద్దకు గ్రామోత్సవంగా తీసుకెళ్లి గంగపూజ చేపట్టారు. ఆదివారం ఆవుల గూడు, రాత్రికి గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి


బొమ్మనహాళ్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


వజ్రకరూరు: జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఉరవకొండ: వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటున్న భక్తులు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి క్యూకట్టారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వాములను దర్శించుకుని భక్తులు పరవశించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

- ఉత్తర ద్వార దర్శనం కోసం బారులుదీరిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు


కళ్యాణదుర్గం: అలంకరణలో వేంకటేశ్వర స్వామి


బ్రహ్మసముద్రం: పూజలందుకుంటున్న లక్ష్మీ రంగనాథస్వామి


కణేకల్లు: అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రాయదుర్గం/టౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణుడి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా వెకుంఠ ఉత్తర ద్వారం దర్శనం కోసం భక్తులు వేల సంఖ్యలో పోటెత్తారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు. ప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే నగరేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయం, జంభుకేశ్వరస్వామి ఆలయం, దశభుజ గణపతి ఆలయం, సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, శనీశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక , మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో ఆలయం పోటెత్తింది. అలాగే మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణస్వామి ఆలయం, పాండురంగస్వామి , నేమకల్లు ఆంజనేయస్వామి, కల్లుదేవనహళ్లి ఆంజనేయస్వామి , ఉప్పరహాళ్ క్రాస్ పాండురంగస్వామి, లింగదహాళ్ పాండురంగ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కణేకల్లు: కణేకల్లులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్తరద్వారం ద్వారా స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉరవకొండ: పట్టణంలోని చౌడేశ్వరీకాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా స్వామి ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. అలాగే బ్రాహ్మణవీధిలో ఉన్న పాండురంగస్వామి ఆలయం, బళ్లారి బైపాస్‌లోని శ్రీకృష్ణ ఆలయం, పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెన్నహోబిలంలో ఉత్తరద్వారం ద్వారా భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ విజయ్‌కుమార్ అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అంతరగంగలో చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు. పార్టీ మండల కన్వీనర్ రామచంద్రాకరెడ్డి స్వామిని దర్శించుకున్నారు

వజ్రకరూరు: మండలకేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ల క్ష దీపారాధన, ముక్కోటి ఏకాదశి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ అంగడాల క్రిష్ణయ్య, అర్చకుడు నరసింహామూర్తి, భక్తులు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనారాయణస్వామి ఆలయం, సీతారామస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురంలో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి కల్యాణోత్సవం చేపట్టారు. అలగే బూదిగుమ్మ పద్మావతి వేంకటరమణస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో మూలవిరాట్‌ను ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే సాయి బాబా ఆలయంలో పూజలు చేపట్టారు.

బ్రహ్మసముద్రం: మండంలోని వేపులపర్తిలో ఉన్న లక్ష్మీ రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కుందుర్పి: మండలంలోని కుందుర్పి కోదండరామ స్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయం, తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయం, రుద్రంపల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

కమనీయం.. కల్యాణోత్సవం


లక్ష్మీచెన్నకేశవ స్వామి విగ్రహాలకు కల్యాణం చేయిస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలోని అంతరగంగలో ఉన్న లక్ష్మీచెన్న కేశవస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవతామూర్తులకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. వేడుకలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి నామస్మరణ మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


రాయదుర్గం: మత్స్య ఆకారంలో కొలువుదీరిన వేంకటేశ్వరుడు


రాయదుర్గంటౌన్: వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


కూడేరు: అంతరగంగలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బెళుగుప్ప మండలం శ్రీరంగాపురంలో శ్రీదేవి, బూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవ దృశ్యం


బొమ్మనహాళ్: రుక్మిణీ పాండురంగస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

‘ఆడుదాం ఆంధ్రా’ జయప్రదం చేద్దాం


రాయదుర్గంలో ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల చైర్‌పర్సన్ పొరాళ శిల్ప


ఉరవకొండలో ఆడుదాం ఆంధ్ర ర్యాలీ చేపట్టిన అధికారులు, పార్టీ ప్రజాప్రతినిధులు

రాయదుర్గంటౌన్/ ఉరవకొండ/ కుందుర్పి/ శెట్టూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ వద్ద నుంచి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు కలసి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకూ క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు శారదమ్మ, గౌని లావణ్య, మమత, శ్రీలక్ష్మీ, తాడూరు భాగ్య, గోరంట్ల ఉష, సాబిరాబీ, నసీమా బాను, లుబ్నా గజాల, పొరాళ్ల గోవిందరాజులు, దేవరాజు, ప్రతాప్, వార్డు ఇన్‌చార్జులు, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్రా విజయవంతం చేయాలని ఉరవకొండలో పంచాయతీ కార్యాలయం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు భారీ ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ అమృతరాజ్, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, సర్పంచ్ లలితమ్మ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జీఎంఎస్ మీరంబాషా, ఈఓ గౌస్‌సాహెబ్, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పీఏసీఎస్ చైర్మెన్ వడ్లషేక్షావలి, కోఆప్షన్ సభ్యులు పామిడి సలీం, ఈడిగ ప్రసాద్, బళ్లారి ఆసీఫ్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి వడ్లసలీం తదితరులు పాల్గొన్నారు. కుందుర్పిలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంఈఓ ఓబుళపతి, సర్పంచ్ మారుతేశ్వరి, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, శివ, అప్సర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శెట్టూరులో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ లక్ష్మీదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామారావు, ఎంఈఓ శ్రీధర్, ఏపీఓ రమేష్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు అర్చకులు కుంకుమార్చన, పంచామృతాభిషేకం, పూర్ణాహుతి, మహామంగళారతి తదితర పూజలు చేపట్టారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకువచ్చి రథంలో అధిష్టించి గ్రామంలో మేళతాళాలు, డప్పుల నడుమ ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు ఉత్సాహంగా నందికోళ్లతో నృత్యం చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, యువ నాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, నాయకులు రవి, ఎర్రిస్వామి, కాంట్రాక్టర్ ఆర్బీ కాంతారెడ్డి, గోవిందరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, జయంతి విష్ణు, శీన, నగేష్, టీ శివ, కేఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత సత్తా చాటాలి

గుమ్మఘట్ట: క్రీడా పోటీల్లో సత్తా చాటాలని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో ఆర్‌వైఎస్ఎల్-3(రాయదుర్గం యూత్ స్పోర్ట్స్‌లీగ్) క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలన్నారు. పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నట్లు మేనేజర్లు నగేష్, శీన,ఉమేష్ తెలిపారు. మొదటి రోజు నేత్రపల్లి, సిరిగెదొడ్డి,కె.పి.దొడ్డి గ్రామాల జట్టు విజయం సాధించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బీ కాంతారెడ్డి, బీటీపీ గోవింద, కేఎం రాజు, టీ శివకుమార్, గోవిందరెడ్డి, జయంతి విష్ణు, బళ్లారి శివ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న సీఐ, ఎంపీడీఓ, మాల మహానాడు నాయకులు


ఉరవకొండ: క్రిస్మస్ సందర్భంగా మాల మహానాడు ఆధ్వర్యంలో పేద మహిళలకు శనివారం చీరల పంపిణీ చేపట్టారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి అర్బన్ సీఐ తిమ్మయ్య, ఎంపీడీఓ అమృతరాజ్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పుష్పాంజలి హాజరయ్యారు. అనంతరం 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు యూత్ నాయకులు తేజ, కిష్ట, మోహన్, చాముండి, హరి, అజిత్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక


రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా ఉపాధి పథకం కింద 2022, ఏప్రిల్ 1 నుంచి 2023, మార్చి 31 వరకూ జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీవీఈఓ రమణారెడ్డి, ఏపీడీ రమేష్‌నాయక్, ఎంపీడీఓ రమేష్ నాయక్, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఉపాధి పథకం కింద పండ్ల తోటల పెంపకం పనులకు సంబంధించి రైతులకు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి అవగాహన కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకంలో నాటిన మొక్కలు 50 శాతం తక్కువగా ఉంటే బిల్లులు మంజూరు చేయకూడదని సూచించారు. భవిష్యత్తులో క్షేత్రస్థాయిలో జరిగిన తప్పిదాలకు ఎటువంటి సంజాయిషీ లేకుండా రికవరీ చేస్తామన్నారు. కాగా వివిధ పనులకు సంబంధించి రూ.1,33,796 రికవరితోపాటు రూ.1,10,000 జరిమనా విధించారు. కార్యక్రమంలో ఏఓ నందికిశోర్, ఏపీఓ అవినాష్, ఈసీ జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు లావణ్య, పండరీష్, మంజునాథ, వన్నూర్‌స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతుల పాల్గొన్నారు.

రూ.35.20 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం


సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గం: రాయదుర్గం పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.35.20 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం లభించింది. ఇందులో రూ.98.79 లక్షలు మిగులు బడ్జెట్‌గా నివేదించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి నూతన బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.36.89 కోట్లతో అంచనా వేసిన మొత్తంలో సాధరణ ఆదాయం రూ.37.30 కోట్లు లభించింది. ఈ లెక్కన అన్ని విభాగాల నుంచి మున్సిపాలిటీకి రూ.41 లక్షల ఆదాయం సమకూరింది. గత ఏడాదితో పోల్చితే ఈ సారి రూ.2.30 కోట్లు బడ్జెట్ ప్రణాళిక తగ్గింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్ బడ్జెట్ కూర్పుపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్థిక ప్రణాళికలు పెంచేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఈ విషయంపై చైర్‌పర్సన్, కమిషనర్ జోక్యం చేసుకుని ఇది కేవలం అంచనా మాత్రమేనని, సభ్యుల ఆమోదం మేరకు బడ్జెట్ పెంచేలా కృషి చేస్తామని హామీఇచ్చారు. 2023-24 లో ఆస్తిపన్ను రూ.1.33 కోట్లు అంచనా వేస్తే రూ.1.27 కోట్ల ఆదాయం రాబట్టామన్నారు. 2024-25లోనూ దాన్ని రూ.1.35 కోట్లకు పెంచామన్నారు. అలాగే ప్రకటనలు, ఖాళీ స్థలాలు, ఆస్తిపై వడ్డీ, జప్తు రుసుం, మెజిస్ట్రీరియల్ జరిమానాలు, ఆస్తి, పేరుమార్పిడి పై స్టాంపు రుసుం, రెవెన్యూ గ్రాంట్‌కు రూ.1.16 కోట్లు 2023-24లో ఆదాయం సమకూరగా, 2024-25 లో 1.17 కోట్లకు ప్రతిపాదించినట్టు స్పష్టం చేశారు. సభ్యుల విజ్ఞప్తిమేరకు పట్టణ పరిసరాల్లో ఏర్పాటైన లేఅవుట్లలో ఆక్రమణలు అరికట్టేలా చర్యలు చేపడతామన్నారు. దొంగ డీ-పట్టాల పై సమగ్ర విచారణ కోరతామన్నారు.

సాధారణ సమావేశంలో సమస్యల వెల్లువ..

బడ్జెట్ అనంతరం సాధారణ సమావేశం నిర్వహించారు. సభ్యులు పలు సమస్యలు ప్రస్తావిస్తూ పరిష్కారానికి మార్గం కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో పుట్టప్పతోట డ్రైనేజీ నిర్మాణంలో మిగిలిన రూ. 1.18 కోట్లు మెత్తాన్ని ఖర్చు చేయాలని కౌన్సిలర్ అజయ్ ప్రస్తవించగా, దీనికి డీపీఆర్ సిద్ధం చేసి పంపామని కమిషనర్ తెలిపారు. అలాగే రూ.1.26 కోట్లతో సాలిడ్‌వేస్ట్‌మేనేజ్‌మెంట్ నిర్మాణానికి బడ్జెట్‌లో ఆమోదం తెలిపామని గుర్తుచేశారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఖర్చుచేసే రూ.12 లక్షలను తాగునీటి కోసం ఖర్చుచేయాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. పరిశీలిస్తామని కమిషనర్ తెలిపారు. వచ్చే వేసవి దృష్ట్యా తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ఉట్లకుంటలో డీషిల్టింగ్ తొలగించి నీటి వృద్ధికి కృషి చేయాలని కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, పద్మజ కోరారు. పట్టణంలో కుక్కల బెడద అరికట్టాలని వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా కోరారు. ఇందుకు చైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ సానుకూలత వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుల నియామకం

ఉరవకొండ: నియోకవర్గంలో ఐదు మండలాలకు సంబంధించి పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షులను నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఉరవకొండ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా సింగాడి ధనరాజ్, రూరల్ అధ్యక్షుడిగా ఉదయ్‌రెడ్డి, బెళుగుప్ప అధ్యక్షుడిగా సురేష్, కూడేరు అధ్యక్షుడిగా శివ, విడపనకల్లు అధ్యక్షుడిగా దేశాయి సిద్ధార్థ, వజ్రకరూరు అధ్యక్షుడిగా గోవర్ధన్ నియమితులయ్యారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండండి

కణేకల్లు: వ్యాపారుల మోసాలపై అప్రమత్తంగా ఉండాలని గుంతకల్లు డివిజన్ తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ సూచించారు. కణేకల్లు జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం ఆయన విద్యార్థులకు లీగల్ మెట్రాలజీ చట్టంతో పాటు కొలతల్లో మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక స్వయంభేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నిత్యావసర వస్తువులను తక్కువ తూకాలతో విక్రయించి మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంతో శనివారం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వివరాలు.. శెట్టూరు మండలం మల్లేపల్లికి చెందిన వన్నూరస్వామి తల్లిదండ్రులు విడిపోయారు. ఈ విషయంలో అతడు చాలా మదన పడుతూ ఉండేవాడు. శనివారం తీవ్ర మనస్థాపం చెంది కళ్యాణదుర్గంలోని ఇందిరమ్మ కాలనీలో కూలి పనికి వచ్చి అక్కడే విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కళ్యాణదుర్గం రూరల్: బాల వెంకటాపురంలో శనివారం రాత్రి చలిమంట వేసుకుంటూ.. అదే గ్రామానికి చెందిన ముత్యాలు, రాము అనే ఇద్దరు వ్యక్తులు గొడవపడ్డారు. ఘర్షణ పెద్దగా మారి ఇరువర్గాల మధ్య దాడులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంతో.. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.